క్లుప్తంగా

అంబేడ్కర్ స్ఫూర్తితో చదవాలి



శిక్షణ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న డీఈవో రమేష్

నాగులుప్పలపాడు: జీవితంలో ఎన్నో ఒడిదొడుకులు, అవమానాలు ఎదుర్కొని తన జాతి ఉద్ధరణే కాక, యావత్ ప్రపంచానికి మార్గదర్శి అయిన డా.అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని చదువులో రాణించాలని డీఈవో పిల్లి రమేష్ అన్నారు. మిషన్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో నాగులుప్పలపాడులో వేసవి కాలంలో ఏర్పాటు చేసిన ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఎస్సీ కాలనీల్లో ఉండే విద్యార్థులు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఈవో పీకా మధుసూదనరావు, ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత, విజయేంద్ర బహుజన్, గుంపుల సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



కార్మిక జెండాను ఆవిష్కరిస్తున్న రత్నాకర్‌బాబు

చీమకుర్తి: కాంట్రాక్ట్ బేసిస్‌పై పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కే.రత్నాకర్‌బాబు డిమాండ్ చేశారు. మేడే కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం సంతనూతలపాడు మండలం వేములపాడు పీహెచ్‌సీలో ఆయన కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్మికులు, ఉద్యోగులు, కర్షకుల మధ్య ఐక్యత సాధించినప్పుడే హక్కులు సాధించుకోగలమని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జీ.నాగేశ్వరరావు, రమణమ్మ, మోహన్‌రావు, అరుణ కుమారి, స్థానికులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం వద్ద వైద్యులు, సిబ్బంది

ఒంగోలు అర్బన్: స్థానిక గుంటూరు రోడ్డులోని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని 4, 49, 48వ డివిజన్ల కార్పొరేటర్లు జాకీర్, అంగిరేకుల గురవయ్య, వేమూరి మాల్యాద్రి మంగళవారం ప్రారంభించారు. ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ చాపల శాంతకుమారి సమాజ సేవలో తమవంతు పాత్ర పోషించడం హర్షణీయమని కార్పొరేటర్లు కొనియాడారు. డాక్టర్లు సానల ధీరజ్‌బాబు, నాగిడి కుమార్ వర్మ, సున్నపు విజయ్‌కుమార్, నందలూరి సరయు, పొక్కినగారి ఏడుకొండలు, సామిత్ర పల్లవ్, శివసాయికృష్ణ, పుల్లారెడ్డి, నాగేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణపై రచనలకు ఆహ్వానం

ఒంగోలు: సూపర్‌స్టార్ కృష్ణపై రచనలను ఈనెల 25వ తేదీలోగా పంపాలని సూపర్‌స్టార్ కృష్ణ కళాపరిషత్ అధ్యక్షులు జాలాది మోహన్, పుస్తక సమన్వయకర్త, ప్రజారచయిత డాక్టర్ మొగిలిదేవ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31న హీరో కృష్ణ జయంతి సభ సందర్భంగా 'తనివి తీరలేదే' అనే పుస్తక సంకలనాన్ని ప్రచురించాలని నిర్ణయించామన్నారు. హీరో కృష్ణ జీవితం, నటన, ఆయన ఔన్నత్యం, కృష్ణ గొప్పదనం, సాహసం, మంచి మనసు, వ్యక్తిత్వంపై వచన/పద్య కవితలు, గేయాలు/పాటలు, వ్యాసాలను వాట్సప్ నంబర్ 6309373962కు లేదా ఈమెయిల్ పి.న్యూస్2001 :జీమెయిల్.కామ్‌కు పంపాలని సూచించారు.

ఒంగోలు లయన్స్ క్లబ్ కలాం ప్రకాశం అధ్యక్షునిగా సురేష్



సురేష్

ఒంగోలు: ఒంగోలు లయన్స్ క్లబ్ కలాం ప్రకాశం అధ్యక్షునిగా ట్రినిటీ స్కూలు కరస్పాండెంట్ కొప్పోలు సురేష్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక ట్రినిటీ స్కూల్లో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యదర్శిగా నాగూర్‌వలి, కోశాధికారిగా మీరావలి ఎంపికయ్యారు. ఎంపిక వివరాలను ప్రస్తుత అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి మీడియాకు విడుదల చేశారు. 2023-24 సంవత్సరానికి నూతన కార్యవర్గం బాధ్యతలు నిర్వహిస్తుందని తెలిపారు. ఎలక్షన్ కమిటీ అధ్యక్షులుగా షేక్ సత్తార్ వ్యవహరించగా, పూర్వ అధ్యక్షులు ఫిరోజ్, డాక్టర్ లంకా ప్రసన్న, సాజిద్ ఖాన్, సాయి, గైడింగ్ లయన్ డాక్టర్ షాకీర్, లయన్స్ సభ్యులు చిట్టిబాబు, కళ్యాణ్, సల్మాన్ ఖాన్, షోయబ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహిద్దాం

- సాంకేతిక విద్య తిరుపతి ఆర్‌జేడీ నిర్మల్ కుమార్ ప్రియ
- ఈతముక్కల మహిళా పాలిటెక్నికల్ కాలేజీలో 43 మంది బాలికలకు ఉద్యోగాలపై హర్షం
- ఉద్యోగ విజయోత్సవ సభలో నియామక పత్రాలు అందజేత



ఉద్యోగ నియామపక పత్రాలు అందుకున్న విద్యార్థినులతో నిర్మల్ కుమార్ ప్రియ, ప్రజాప్రతినిధులు

కొత్తపట్నం: బాలికలను చదువుకునేలా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సాంకేతిక విద్య తిరుపతి ఆర్జేడీ ఎ.నిర్మల్‌కుమార్ ప్రియ విజ్ఞప్తి చేశారు. కొత్తపట్నం మండలం ఈతముక్కలలో ఉలిచి వెంకారెడ్డి, సీతారావమ్మ మహిళా పాలిటెక్నిక్ కాలేజీలో 43 మంది విద్యార్థినులు ఉద్యోగాలు పొందిన సందర్భంగా మంగళవారం కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ వి.ఎస్.సుబ్రసాద్‌రావు అధ్యక్షత వహించిన సభలో ఆర్జేడీతోపాటు జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, సర్పంచ్ మేడికొండ సునీత, మాజీ సర్పంచ్ దాచూరి గోపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆర్జేడీ నిర్మల్ కుమార్ ప్రియ మాట్లాడుతూ.. ఈతముక్కల మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు జిల్లాలో ప్రత్యేక గుర్తింపు ఉందని, దానిని నిలబెట్టేలా 43 మందికి ఒకే పర్యాయం ఉద్యోగాలు రావడం హర్షణీయమన్నారు. బాలికలు ఉద్యోగంలో చేరేలా ప్రోత్సహించి వారి కాళ్ల మీద నిలబడేలా చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యా రంగాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి పథకాలు పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. కాలేజీలో డీసీసీపీ, డీసీఎంఈ, డీఈసీఈ కోర్సులు పూర్తి చేసి వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన బాలికలు తప్పనిసరిగా విధుల్లో చేరాలని కోరారు.

జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి మాట్లాడుతూ.. తమ గ్రామంలో మహిళా పాలిటెక్నికల్ కాలేజీ ఏర్పాటు చేయడంతో ఎంతో మంది ఇక్కడ చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని పేర్కొన్నారు. కాలేజీ ఏర్పాటు చేసి 35 ఏళ్లయిందని, అప్పటి నుంచే ఉన్న మంచి పేరును మును ముందు కొనసాగించాలని అధ్యాపకులను కోరారు. కాలేజీ చుట్టుపక్కల చిల్లచెట్లు తొలగించడంతోపాటు విద్యుత్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దాచూరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను సర్పంచ్‌గా ఉన్నప్పుడు మహిళా పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటుకు 13 ఎకరాల స్థలం అవసరం కావడంతో ఉలిచి వెంకారెడ్డి, సీతారామమ్మలు తమ భూమిని బహూకరించారని పేర్కొన్నారు. అందుకే ఉలిచి వెంకారెడ్డి, సీతారావమ్మ మహిళా పాలిటెక్నిక్ కాలేజీ అని నామకరణం చేశామని గుర్తు చేశారు. ఎంపీడీఓ డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ.. బాలికలు బాగా చదువుకుంటే భవిష్యత్‌లో అనేక అవకాశాలు ఉన్నాయని, మహిళలకు ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్ ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. అనంతరం 43 మంది విద్యార్థినులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. స్థల దాత కుటుంబీకులు జెట్టి శ్రీనివాసరెడ్డి, ఉద్యోగ శిక్షణ నియమాకాల అధికారి కె.ఎలీషా, డాక్టర్ ఆర్‌వీ కృష్ణయ్య, అధ్యాపకులు డాక్టర్ సుధాకర్‌రావు, కుమారి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

అవ్వ తాతలకు కంటి వెలుగు



కాకాని కంటి ఆస్పత్రికి వెళుతున్న 41 మంది వృద్ధులు



కంటి చికిత్సలకు వెళుతున్న రోగులకు జాగ్రత్తలు చెబుతున్న డాక్టర్ ఆనందమోహన్‌తో సిబ్బంది

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడు పీహెచ్‌సీ ఆస్పత్రి డాక్టర్‌లు మానస, ఆనందమోహన్ ఆప్తాలిమిక్ ఆఫీసర్ జయరాజ్‌ల ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగు పథకంలో భాగంగా మంగళవారం 51 మందికి కంటి ఆపరేషన్ల నిమిత్తం గుంటూరు శంకర నేత్రాలయకు రోగులను తరలించారు. ఆస్పత్రి సిబ్బంది అందించిన సమాచారం మేరకు రెండు నెలలుగా 300కి పైగా కంటి పరీక్షలు నిర్వహించి వారిలో ఆపరేషన్లు అవసరమైన 54 మందిని గుర్తించారు. వారిలో ముగ్గురి ఆరోగ్య పరిస్థితి మేరకు నిలిపి వేసి మిగిలిన 51 మందిని కంటి ఆపరేషన్‌ల నిమిత్తం శంకర నేత్రాలయకు తరలించారు. వీరికి ఆపరేషన్లు నిర్వహించిన అనంతరం అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తారని, వారిని మూడో రోజు మళ్లీ తిరిగి మద్దిపాడుకు తీసుకొస్తారని జయరాజ్ తెలిపారు. అవ్వతాతలు ఈ పథకాన్ని వినియోగించుకుని ఆపరేషన్లు చేయించుకోవాల్సిందిగా కోరారు.

ఆరోగ్యశ్రీ ద్వారా 41 మందికి కంటి ఆపరేషన్‌లు

చీమకుర్తి: సంతనూతలపాడు పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో 41 మంది పేషంట్స్‌ను కంటి ఆపరేషన్ నిమిత్తం మంగళవారం గుంటూరు జిల్లా కాకాని శంకర్ కంటి ఆస్పత్రికి ప్రత్యేక బస్సులో పంపించారు. సంతనూతలపాడు, ఎండ్లూరు, మైనంపాడు, రుద్రవరం, గురవారెడ్డిపాలెం గ్రామాలలో కంటి చూపు కనిపించని వారు, కంటిలో శుక్లాలు ఏర్పడిన వారిని ముందుగా పీహెచ్‌సీకి చెందిన వైద్యసిబ్బంది గుర్తించారు. వారందరికీ ఆరోగ్యశ్రీ ద్వారా శంకర కంటి ఆస్పత్రిలో ఆపరేషన్‌లు చేయించేందుకు సంతనూతలపాడు పీహెచ్‌సీ డాక్టర్‌లు పీ.హరిణి, నాగరాజు, సీహెచ్‌ఓ ప్రసాద్, ఆప్తాలమిక్ అధికారి శ్రీనివాసరావు, స్థానిక ఏఎన్‌ఎంల సహకారంతో వారికి కంటి ఆపరేషన్‌లు చేయించుటకు ఆరోగ్యశ్రీ ద్వారా ఏర్పాట్లు చేశారు.

వైభవంగా మోహినీ ఉత్సవం



పామూరు: అలంకరణలో పోలేరమ్మ

హనుమంతునిపాడు: మండల పరిధి నారాయిపల్లిలో సీతారాముల కళ్యాణ మహోత్సవంలో మంగళవారం మోహినీ ఉత్సవం, గ్రామోత్సవం వైభవనంగా నిర్వహించారు. కోలాటం, భజన కార్యక్రమాలు అలరించాయి. వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, మండల సర్పంచ్ సంఘ అధ్యక్షుడు సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, బీసీ సెల్ మండల నాయకులు కేతిబోయిన వెంకట కాశయ్య, మండల రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, ఎంపీటీసీ టి.తిరుపతరెడ్డి మొక్కులు తీర్చుకున్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

పామూరు: గ్రామ దేవత పోలేరమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమం భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. చన్నీటి స్నానమాచరించి పొంగళ్లను ఏర్పాటు చేసుకుని అమ్మవారి ఆలయానికి తరలివచ్చి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు కురిసి పంటలు పండాలని ప్రార్థించారు.



కమ్మవారిపల్లిలో సర్వాంగ సుందరంగా సిద్ధమైన ఆలయం

పీసీపల్లి: మండల పరిధిలోని కమ్మవారిపల్లిలో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా జరుగనున్నాయి. ఆలయంలో పోలేరమ్మ, బంగారమ్మ, పోతురాజుల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బుధవారం, గురువారం హోమాలు నిర్వహిస్తారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగ తీర్చిదిద్దారు.

ఇంటర్ బాలికలకు చీమకుర్తిలో శిక్షణ



విద్యార్థిని, ఆమె తల్లితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

ఒంగోలు రూరల్: ఇటీవల వెలువడిన ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో వెనుకబడిన కరవది జూనియర్ కాలేజీ బాలికలను చీమకుర్తి ప్రభుత్వ కళాశాలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలకు పూర్తి స్థాయి బోధన, శిక్షణ కోసం చీమకుర్తి జూనియర్ కాలేజీలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించలేకపోయిన కరవది జూనియర్ ప్రభుత్వ కళాశాల బాలికలు 24 మందిని చీమకుర్తిలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలిపారు. ఈఓఆర్డీ పూర్ణచంద్రరావుతో కలిసి కరవది గ్రామ సచివాలయంలో మంగళవారం విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. చీమకుర్తిలో శిక్షణకు విద్యార్థులు రాగా తల్లిదండ్రులు కూడా సమ్మతించారు.

ఉత్సాహంగా చెన్నకేశవుని వసంతోత్సవం

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతి సమేత రాజన గరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం చెన్నకేశవస్వామికి వసంతోత్సవం, దొంగలదోపు కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. ప్రత్యేకంగా అలంకరించిన స్వామి వారి ఉత్సవ మూర్తులను పీఠంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం ఏకాంత సేవ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

స్వాతి పైప్స్ అధినేతకు ఘన నివాళి

ఒంగోలు: స్వాతి పైప్స్ అధినేత కవర్తపు శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందగా.. మంగళవారం ఆయన చిత్రపటానికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి నివాళి అర్పించారు. ఎంపీ మాగుంట స్థానిక రాంనగర్ రెండో లైనులోని కవర్తపు శ్రీనివాసరావు నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట అయినాబత్తిన ఘనశ్యాం, అశోహరి చెంచలరావు, ప్రశాంతి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కవర్తపు శ్రీనివాసరావు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి

భూ వివాదంతో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేకు సంబంధం లేదు



మాట్లాడుతున్న ఎంపీపీ మురళి, పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

పొదిలి: కాట్రగుంట పశువుల బీడు భూ వివాదంతో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డికి ఎటువంటి సంబంధం లేదని కొనకనమిట్ల ఎంపీపీ ఎం.మురళి, జెడ్పీటీసీ సభ్యుడు ఎ.ఏడుకొండలు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక సీసీకేఆర్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. 2014లో టీడీపీ హయాంలో తమ పూర్వీకుల ఆస్తిగా చెప్పుకుంటూ కొందరు రికార్డుల్లో నమోదు చేసుకున్నారన్నారు. విషయం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే వద్దకు రావటంతో వారు కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌తో మాట్లాడి బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంతో బాధిత రైతులు గొర్రెలను తహసీల్దార్ కార్యాలయంలోకి తోలి నిరసన వ్యక్తం చేయడం కూడా మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి సలహా మేరకేనన్నారు. తదుపరి వివాదం కోర్టుకు చేరిందన్నారు. బాధిత రైతుల పక్షాన ఉన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలపై అనవసరంగా ఆరోపణలు చేయటం సరికాదన్నారు. ఆరోపణలు ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ మోరా శంకరరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కామసాని వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పూర్వీకుల ఆస్తి కాబట్టే ఆన్‌లైన్ చేయించుకున్నాం :

పూర్వీకుల పేరున ఉన్న ఆస్తి కనుకనే తన భార్య, బంధువుల పేరున ఆన్‌లైన్ చేయించుకున్నట్లు యేదుబాటి వెంకటరావు అలియాస్ రావు చెప్పారు. 2014లో తెలుగుదేశం పార్టీ హయాంలోనే భూమి ఆన్‌లైన్ చేశారని తెలిపారు. ఇటీవల జరిగిన వ్యవహారంగా కొందరు మాట్లాడటం సరికాదని చెప్పారు. వ్యవహారం కోర్టులో ఉందని స్పష్టం చేశారు.

పొగాకు సరాసరి ధర రూ.195

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, మట్టిపాడు గ్రామాల రైతులు 946 బేళ్లు తీసుకురాగా 891 కొనుగోలయ్యాయి. 55 బేళ్లను వివిధ కారణాలతో వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.200, కనిష్ట ధర రూ. 160, సరాసరి రూ.195.05 పలికింది. వేలంలో మొత్తం 19 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.



వేలంలో పాల్గొన్న వ్యాపారులు, రైతులు

నేటి నుంచి ధ్వజ స్తంభం, శిఖర ప్రతిష్ట మహోత్సవాలు



పెద్దదోర్నాలలో వెలసిన విజయ గణపతి ఆలయం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని గణేష్ నగర్‌లో వెలసిన విజయ గణపతి దేవస్థానంలో బుధవారం నుంచి విజయ గణపతి, ధ్వజ స్తంభ, శిఖర ప్రతిష్ట కార్యక్రమాలు జరుగుతాయని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ అర్చకులు రాంప్రసాద్‌శర్మ తెలిపారు. 3వ తేదీ బుధవారం విఘ్నేశ్వర పూజ, యాగశాల సంస్కారం, 4వ తేదీ గురువారం యంత్రాభిషేకం, రుద్రహోమం, 5వ తేదీ ఉదయం 10.42 గంటలకు యంత్ర స్థాపన, విగ్రహ, ధ్వజ స్తంభ, శిఖర, కలశ, బలిపీఠం, ఆదిగణపతి, అంత్య మారుతి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

ప్రేమానురాగాలతో కుటుంబంలో సంతోషం

- అత్తాకోడళ్లు, భార్యాభర్తల అవగాహన సదస్సులో గుంటూరు బైబిల్‌మిషన్ ప్రతినిధులు

ఒంగోలు రూరల్: భార్యాభర్తలు, అత్తాకోడళ్ల విభేదాలకు దూరంగా ఉంటూ ప్రేమానురాగాలు కలిగి ఉంటేనే ఆ కుటుంబంలో సంతోషం వెల్లివిరుస్తుందని గుంటూరు బైబిల్‌మిషన్ గవర్నింగ్ బాడీ మెంబర్, జిల్లా ఇన్‌చార్జి ఆర్.ఎం.పి.ప్రభాకర్‌కుమార్, గాయని స్టెల్లా ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం కరవదిలో నిర్వహించిన అవగాహన సదస్సులో 300కు పైగా జంటలు పాల్గొన్నాయి. జడ్జిల ముందు వెల్లడించిన అనుభవాలను బట్టి ఉత్తమ అత్తాకోడళ్లుగా తాళ్లూరి లక్ష్మి, సుజి, ఉత్తమ భార్యాభర్తలుగా విజయవాడకు చెందిన ప్రసాద్‌సింగ్, భార్య మహిమరాణిని విజేతలుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న భార్యాభర్తలు, అత్తాకోడళ్లు అందరికీ కన్సోలేషన్ బహుమతులు అందించారు. జడ్జిలుగా సీనియర్ అడ్వకేట్ ధనలక్ష్మి, డాక్టర్ విజయలక్ష్మీ, ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్ పెద్దన్న, ప్రొఫెసర్ రాస్పెల్‌రాజా, ప్రొఫెసర్ సాల్మాన్ వ్యవహరించారు. రిటైర్డ్ ఇన్సూరెన్స్ ఆఫీసర్ దయానందం తదితరులు సదస్సులో ప్రసగించారు.



బహుమతి అందుకుంటున్న ఉత్తమ అత్తాకోడళ్లు

ఉదయం ఎండ.. సాయంత్రం వాన..



మధ్యాహ్నం ఇలా..



సాయంత్రం ఇలా..

మార్కాపురం: గత మూడు రోజుల నుంచి మార్కాపురం ప్రాంతంలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. మే నెలలో సాధారణంగా 40 నుంచి 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవుతుంది. గత నాలుగు రోజుల నుంచి మాత్రం పగటి పూట 32, 33 డిగ్రీలు మాత్రమే నమోదవుతూ, మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎండ తీవ్రత పూర్తిగా తగ్గి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోంది. వాతవరణంలో మార్పుల కారణంగా మండు వేసవిలోనూ సాయంత్రం పూట చల్లని వాతావరణాన్ని ప్రజలు ఆస్వాదిస్తున్నారు. గత 15 ఏళ్ల కాలంలో వేసవిలో సాయంత్రం వేళ చల్లటి వాతావరణాన్ని ఎపుడు చూడలేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

పొగాకు గరిష్ట ధర రూ.200

ఒంగోలు రూరల్: స్థానిక పొగాకు వేలం కేంద్రం-2కు మంగళవారం 927 బేళ్లు రాగా 887 కొనుగోలయ్యాయి. 6 బేళ్లు నోబిడ్ అయ్యాయి. గరిష్ట ధర కేజీ రూ.200, కనిష్ట ధర రూ.165, సరాసరి ధర రూ.195.06 పలికినట్లు వేలం నిర్వహణాధికారి కె.రామకృష్ణ తెలిపారు.

గుండెపోటుతోప్రయాణికుడి మృతి



ఆర్టీసీ బస్టాండ్‌లో వెంకటయ్య మృతదేహం

కొమరోలు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఓ ప్రయాణికుడు గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు.. బేస్తవారిపేట మండలం గలిజేరుగుళ్ల గ్రామానికి చెందిన వెంకటయ్య (70)కు ఆరోగ్యం బాగాలేకపోవడంతో తన భార్య తిరుపతమ్మతో గిద్దలూరు వైద్యశాలకు వెళ్లేందుకు తన స్వగ్రామంలో మంగళవారం ఉదయం ఆర్టీసీ బస్సు ఎక్కాడు. బస్సు కొమరోలు చేరే సరికి వెంకటయ్య బస్సులో కూర్చోలేక పోతుండటంతో కొమరోలులోని వైద్యశాలలో చూపించాలనే ఉద్దేశంతో తిరుపతమ్మ తన భర్త వెంకటయ్యను బస్సు నుంచి కిందకు దించింది. 2 నిమిషాల్లోనే ఆర్టీసీ బస్టాండ్‌లో వెంకటయ్య గుండెపోటుతో మృతి చెందాడు. తన బంధువుల సహకారంతో వెంకటయ్య మృతదేహాన్ని స్వగ్రామం గలిజేరుగుళ్ల గ్రామానికి తరలించారు.